# మాస్టారు

"కమలగారేనా? ఆ కమలా... నేను రవీంద్రను మాట్లాడుతున్నాను"

"చెప్పు రవీ. నేనే"

"నర్సింహం మాస్టారు చనిపోయారు..."

"అయ్యో... ఎప్పుడూ?"

"రాత్రి 12.30కి నాకు ఫోనొచ్చింది. వెంటనే బయల్దేరి వెళ్లాను. ఆ పెద్దావిడను ఎలా ఓదార్చాలో నాకు తెలియట్లేదు. వాళ్ల పిల్లలకి ఫోను చేశాను. ఏ సాయంత్రానికో వస్తారు. మనవాళ్లు.... ముఖ్యంగా మాస్టారంటే ఇష్టం ఉన్నవాళ్లకి ఫోను చేసి చెప్పు. నువ్ కూడా త్వరగా వస్తే బావుంటుంది. రాణికీ... పద్మావతికీ కూడా చెప్పు. లేడీస్ ఉంటే ఆవిడ్ని ఓదార్చొచ్చు. నేను పనుల మీద బయటకెళ్లాల్సి వస్తుంది."

"నేనిప్పుడే బయల్దేరుతున్నాను"

"త్వరగా రా, ఆవిడ ఈ దుఃఖంలో ఏ అఘాయిత్యం చేసుకుంటుందో అని భయమేస్తుంది – అనుక్షణం మగాళ్లం కనిపెట్టుకు చూడలేం కదా!

కమ్ ఇమ్మీడియెట్లీ... ప్లీజ్...."

"నువ్వంతగా చెప్పాలా రవీ! ఆయనింకా లేవలేదు. లేపి... నేను ఆటోలో బయల్దేరుతాను అర్ధగంటలో అక్కడుంటాను. పద్మకి ఫోను చేసి మిగిలినవాళ్లకి ఇంటిమేట్ చేయమంటాను"

"ఓకే- థాంక్స్"

"థాంక్సేంటి రవీ - మాస్టారంటే... మాస్టారంటే... నాకు ....."

"నువ్వు ఏడ్వడం కాదు- నాకు తెల్సు నీకు మాస్టారంటే ఎంతిష్టమో... హీ ఈజ్ గ్రేట్..."

+ + +

మాస్టారు ఒకట్నుండి ఏడో క్లాసు దాకా పాఠాలు చెప్పిన మాస్టారే కాదు బాల్య స్నేహితుడు- శిష్యులందరూ ఆయన కన్నా ఎక్కువ చదువులు చదివి ఇంజనీర్లు, డాక్టర్లు, ప్రొఫెసర్లు అయిపోయారు. స్కూల్ నుండి కాలేజీకి, యూనివర్సిటీలకు, విదేశాలకు వెళ్లినా, ఆయన్ను మర్చిపోలేదు. ఆయన ప్రేమే కాదు కోపం, కొట్టడం అన్నీ తియ్యటి జ్ఞాపకాలే.

ఆ మధ్య రిటైర్ అయినప్పుడు 'సమాచారం' పేపర్లో సన్మానం సభ వార్త చదివి, స్కూలు పట్టనంత మంది పాత విద్యార్థులు మాస్టారు ఇల్లు నిండేటన్ని దండలేసి గౌరవించుకున్నారు.

అప్పర్ ప్రైమరీ స్కూల్లో... తెలుగు చెప్పే మాస్టారుకు ఇంత ఘనమైన వీడ్కోలు సభ.... చుట్టుపక్కల జిల్లాల్లో ఏ స్కూలు చరిత్రలోనూ జరగలేదు. మీటింగ్ హాల్లో స్టాఫ్ పదిమంది తూతూ మంత్రంగా జరిపే వీడ్కోలు సభలు ఎన్నో చేసిందా స్కూలు. కానీ... నర్సింహం మాస్టారు సన్మానం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రో. ప్రధానమంత్రో. ఇంకా ఏ గొప్పవాడో ఆ

స్కూలుకొచ్చినంతగా కిక్కిరిసిపోయింది.

ఓల్డు స్టూడెంట్స్ తరపున రవీంద్ర, కమలలే మహోత్సాహంగా మహోత్సవంగా జరగడానికి స్నేహితులందర్నీ పిలిచారు. పిలవకపోయినా వాళ్లంతా వచ్చేవారే -

మాస్టార్లో రిటైర్ అవుతున్నానన్న బెంగలేదు. రిటైర్ అయ్యేంత వయసొచ్చిందన్న బాధా లేదు.

"నా పిల్లలందరూ పెద్దవాళ్లవుతున్నారు. నాకన్నా ఎత్తుగా, నాకన్నా గొప్పగా ఎదుగుతున్నారు. ఏటికేడాది నాకు కొత్త బ్యాచ్ పిల్లల్తోనే సహజీవన భాగ్యం అబ్బింది. అదే నా ఆరోగ్యభాగ్యం అనిపిస్తుంటుంది. ఇంకో ఇన్నేళ్లు ఇలా సహచర్యం చేసే అవకాశం నాకున్నా ఎన్నాళ్లికీ నాకు ముసలితనం రాదు. ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ మై ప్రొఫెషన్. నేను పిల్లల్తో పిల్లాడిలా కల్సుండే భాగ్యం దూరమవుతోంది! రికార్డుల్లో నాకు రిటైర్ ఏజ్ వచ్చింది - పింఛన్ తీసుకుంటూ రామా కృష్ణా అనుకుంటూ బ్రతుకు గడిపేయాలి. ఓకే - ప్రతీ కథకీ ఓ ముగింపు ఉండాలి కదా! ఇప్పుడు నా కథ ముగింపు మలుపులో ప్రవేశించింది.

హెడ్ మాస్టారుగారు అనుమతిస్తే ఓ చిన్నమాట! వారంలో ఒక్క అరగంట పిల్లల్ని నా కోసం వదిలిపెట్టండి. నేనిక్కడికైనా వచ్చి, స్కూల్ గ్రౌండ్‌లోనైనా నా పిల్లల్తో మాట్లాడుకుంటూ నేను చెప్పాల్సిన సిలబస్ పూర్తి చేస్తాను- పాఠాలే కాదు... పాటలు, పద్యాలు నేర్పించి వాళ్లతో ఆడుతూ పాడుతూ ఇంకొన్నాళ్లు ఆయుర్దాయం పెంచుకుంటాను.

ఇంకా పని చేస్తున్న మీరందరూ అదృష్టవంతులు... అనుక్షణం బాల్యావస్థలో ఆనందించే ఉపాధ్యాయ వృత్తి మనది. ఎన్ని జన్మలెత్తినా ఇలాగే ఈ చిన్ని పిల్లల మధ్యనే గురువుగా అనేక తరాలు గడపాలని

ఆకాంక్షిద్దాం.

పిల్లలూ మా ఇంట్లో ఆదివారాలు ఆడుకుందాం రండి! అక్కడ మాస్టారు... ఈ మాస్టారు కాదు మీ తాతయ్య. మీ స్నేహితుడు... మిమ్మల్ని తిట్టడు... కొట్టడు... మీ క్లాసుమేటులా మీతో కల్సిపోతానంటే నమ్మండి. నిజానికి నేనూ మీ క్లాసుమేటేగా!"

ఇలా మాస్టారు మాట్లాడిన మాటలు పిల్లల్ని ఏడ్పించాయి, నవ్వించాయి.

అప్పుడు ఓల్డు స్టూడెంట్స్ తరపున రవీంద్ర మాట్లాడుతూ... "మాస్టారు కొత్త బ్యాచ్ పిల్లల్నే ఇంటికి రమ్మంటున్నారు. మరి మా సంగతేంటి. మేమూ ఆయన పిల్లలమే... అంచేత మేమూ ఆదివారాలు ఆయనింటికి వెళ్తాం. ఆయన మమ్మల్ని కొట్టొచ్చు- తిట్టొచ్చు- ఏడ్పించొచ్చు" అన్నాడు స్కూల్ ఆవరణంతా చప్పట్లతో దద్దరిల్లిపోయింది. కన్నీళ్లతో ముద్దయి పోయింది.

✢ ✢ ✢

ఆదివారం పిల్లలందరూ వచ్చేవేళ -

మాస్టారిల్లు కన్నీళ్లతో ముద్దయిపోతోంది.

కమలా... పద్మావతి... రాణీ... మాస్టారి భార్యని చుట్టుముట్టి గగ్గోలు పెట్టేశారు. తండ్రిపోయిన ఆడపిల్లల్లా ఆయనని కన్నీళ్లతో అభిషేకించారు.

ఆలస్యంగా వచ్చిన పెన్షన్ ఆఫీసు హెడ్ క్లర్క్ నాగభూషణం నిర్ఘాంత పోయాడు. ఈ మాస్టారు... కమల మాస్టారా? తనిన్నాళ్లూ ఎందుకు చూళ్లేదు? కమల అస్తమానూ చెప్పే మాస్టారు ఈయనేనా? తనెంతో

తప్పు చేసినట్లు గమనించాడు.

✦ ✦ ✦

శనివారం... అంటే నిన్న మధ్యాహ్నం నరసింహం మాస్టారు పెన్షన్ ఆఫీసుకి వచ్చారు – నిన్న అనేంటి ఆర్నెలలుగా ప్రతీ నెలా పదిహేను ఇరవై సార్లు వచ్చారు.

"చూడండి మాస్టారూ మీరెన్నిసార్లు వచ్చారో... వచ్చినందుకు తమకి ఎంత డబ్బు రిక్షాలకి ఖర్చయిందో... ఈ లెక్కలు మాతో చెప్పి వేస్టు – పెన్షన్ కాయితాలు చేతిలో పడటానికి మొదటినెల కొంత ఖర్చు పెట్టాలి– – ఆ తర్వాత మా చుట్టూ మీరు తిరగక్కర్లేదు – జీతం అందుకున్నట్లు ప్రతీ నెలా మొదటి వారంలో పోస్టాఫీసులో డబ్బు డ్రా చేసుకోవచ్చు– రిటైరై ఇంట్లో దర్జాగా కూచుని తినటానికి ఖర్చుకోసం వెనకాడితే ఎలా? మీరు నెలనెలా మా దగ్గరకిరారుగా?"

"నేను లంచం ఇవ్వనయ్యా! నీ వృత్తి నువ్వు చేయడానికి గవర్నమెంట్ నీకు జీతం ఇస్తోంది– నువ్వెప్పుడు కాయితాలిస్తే అప్పుడే తీసుకుంటా"

"భారతీయుడులో కమలహాసన్ అన్నమాట – అలాక్కానీయండి. మీ ఆవిడే పెన్షన్ తీసుకుంటారు" వెటకారంగా అన్నాడు హెడ్ క్లర్క్ నాగభూషణం.

మాస్టార్ ఆ మాటకి బాధ పడలేదు. చిత్రంగా ఓ చూపు చూశారు.

మాస్టారు దిగాలుగా కాదు – పొగరుగానే వెళ్లి పోయారు.

"పి...సి...నా...రి" అని జాలిగా కసిగా మొండిగా నవ్వుకున్నాడు నాగభూషణం.

'నిజానికి నీ పేపర్స్ ఎప్పుడో రడీ అయిపోయాయి పంతులూ.

నాకు నీ మీద జాలి ఐనా కలగాలి... లేదా ఆ జేబులో డబ్బులైనా పడాలి. రెండోదైతేనే నీకు ఈజీ' అనుకున్నాడు.

✦ ✦ ✦

"పెన్షన్ కాగితాలకని రోజూ ఎండలో పడి వెళ్లడం... వచ్చేప్పటికి నీరసం, నిస్త్రాణ– ఆ డబ్బు రాకపోతే ఇల్లు గడవదా అంటే 'అది మన హక్కే! వదులుకోకూడదు' అని ఓపిక చేసుకుని వెళ్లేవారు" అంటూ మాస్టారి భార్య రోదిస్తోంది.

నాగభూషణం అక్కడ నిలబడలేకపోయాడు.

హత్య చేసిన వ్యక్తిలా వణికిపోయాడు.

హుటాహుటిన ఆఫీసుకెళ్లాడు – వాచ్‌మెన్‌తో చెప్పి తన టేబుల్ మీద ఫైళ్లలో ఉన్న మాస్టారు కాగితాల్ని తీసుకున్నాడు.

పదిహేను రోజుల క్రితం పూర్తయినట్టు డేటుంది.

నాగభూషణం గుండె కలుక్కుమంది.

మాస్టారింటికొచ్చి కమలని పక్కకు పిల్చాడు. కాగితాలు చూసిన కమల, భర్తకేసి తీక్షణంగా చూసింది – ఏడ్చిన కమల కళ్లు మరింత ఎర్రబారాయి.

నాగభూషణం తల, కళ్లు దించుకున్నాడు.

"మీ మాస్టారు చనిపోతూ నాకు పాఠం చెప్పారు. జీవితాంతం గుర్తుంచుకోవల్సిన..." పూర్తిగా చెప్పలేకపోయాడు. గొంతు పూడుకుపోయి, కమల "మాస్టారూ..." అని ఏడుస్తూ కాయితాలు ఆయన దగ్గరపెట్టి బావురుమంది.

